క్లుప్తంగా

శివకృష్ణారెడ్డికి అభినందనలు


వెన్నా శివకృష్ణారెడ్డి

పెద్దారవీడు: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా వింగ్ జిల్లా అధ్యక్షుడిగా వెన్నా శివకృష్ణారెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మండల పార్టీ నాయకులకు శివకృష్ణారెడ్డి బుధవారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన శివకృష్ణారెడ్డి భార్య సంజీవరాణి సర్పంచ్‌గా ప్రస్తుతం పని చేస్తున్నారు. శివకృష్ణారెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి పార్టీ అభివృద్ధి కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. మండలంలో వైఎస్సార్ సీపీ మద్దతు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు శివకృష్ణారెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రాములు నాయక్


రాములు నాయక్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని చెర్లో తండాకు చెందిన పి.రాములు నాయక్ రెండో సారి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం నియామకపత్రాన్ని అందజేసింది. 2014లో ఆయన వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎంపీటీసీగా పోటీ చేసి విజయం సాధించారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ 2019లో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించింది. మరోసారి ఆయనకు జిల్లా పదవి వరించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తున్న తనకు మరో పర్యాయం ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన జగనన్నకు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గౌతమి డిగ్రీ కాలేజీ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఈఓ నాగేంద్రబాబు

దొనకొండ: స్థానిక శ్రీగౌతమి డిగ్రీ కాలేజీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం సీఈఓ నాగేంద్రబాబు కళాశాల ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి విద్యను అభ్యసించాలన్నారు. మార్చిలో జరగనున్న పరీక్షలకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామయోగి, అడ్మిన్ నానీ, అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వర్‌రెడ్డి, విక్టోరియా పాల్గొన్నారు.

త్రిలోక పుణ్యక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి పూజలు

బేస్తవారిపేట: స్థానిక దరగా రోడ్డులోని త్రిలోక పుణ్యక్షేత్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పూజ, ప్రత్యేక అలంకరణ, ఉత్తర ద్వారం నుంచి దర్శనం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం గ్రామోత్సవం ఏర్పాటు చేశామన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

బేస్తవారిపేట: భారత కమ్యూనిస్ట్ పార్టీ, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కె.రమణ, సహాయ కార్యదర్శి జోసఫ్‌లు కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలు కేటాయించాలని, నియోజకవర్గంలో సాగుకు అనుకూలమైన అటవీ, బంజరు భూములు భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణాలకు రూ.5 లక్షలు కేటాయించాలని, అసైన్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరుతూ కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

కొమరోలు: మండలంలోని రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజశ్రీ తెలిపారు. మండలంలోని అల్లినగరం, గోనపల్లె గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ గ్రామవ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ సహాయకులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తారన్నారు. రైతు రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు చేసిన అనంతరం రైతులకు ప్రత్యేక సంఖ్య కేటాయిస్తారని, వివరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

బడిలో దాహం తీరేదెలా?

- అటకెక్కిన శుద్ధజల యంత్రాలు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు


ఇంటి నుంచి నీరు తెచ్చుకున్న విద్యార్థులు

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్‌లు చాలాచోట్ల మరమ్మతులకు గురై అటకెక్కాయి. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రెండు విడతల్లో చాలా పాఠశాలలకు శుద్ధజల యంత్రాలు అందజేశారు. కొన్ని పాఠశాలల్లో యంత్రాలు మరమ్మతులకు గురికావడంతో వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. చాలా పాఠశాలల్లోని విద్యార్థులు ఇళ్ల నుంచి సీసాల్లో నీరు తెచ్చుకుని దప్పిక తీర్చుకుంటున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని 5 మండలాలతో పాటు పుల్లలచెరువు మండలంలోని 24 పాఠశాలలకు శుద్ధజల యంత్రాలు పంపిణీ చేయగా చాలా మటుకు పనిచేయడం లేదు.

నిర్వహణ లేకే ఇబ్బందులు

ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మంచినీటి యంత్రాలు మరమ్మతులకు గురైతే క్షేత్రస్థాయిలో మరమ్మతులు చేసే ఇంజినీరింగ్ అధికారులు లేరు. ఏదైనా సమస్య ఉంటే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయమని అధికారులు చెబుతున్నారేగానీ మరమ్మతులు చేసి విద్యార్థుల దప్పిక తీర్చుదామని పట్టించుకునే వారే లేరని ఉపాధ్యాయులు సైతం వాపోతున్నారు. చాలాచోట్ల చేసేది లేక విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులే శుద్ధ నీటిని అందుబాటులో ఉంచుతున్నారు. మరికొన్న చోట్ల విద్యార్థులు తమ ఇళ్ల నుంచి బాటిళ్లతో మంచినీరు తెచ్చుకుంటున్నారు.


పుల్లలచెరువు పాఠశాలలో నిరుపయోగంగా శుద్ధజల యంత్రం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం: మరమ్మతులకు గురైన శుద్ధజల యంత్రాల గురించి ఇప్పటికే జిల్లా అధికారులకు నివేదికలు అందజేశాం. దీనిపై ఉపాధ్యాయులకు ప్రత్యేక యాప్ ఇచ్చాం. శుద్ధజల యంత్రాలు మరమ్మతులకు గురైన చోట ఆ పాఠశాల ఉపాధ్యాయులు దానిలో నమోదు చేస్తే ఇంజినీరింగ్ అధికారులు వచ్చి బాగు చేస్తారు. పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠశాల నిధులతో మంచినీరు కొని తాత్కాలికంగా సమస్యను పరిష్కరిస్తున్నారు.

శామ్యూల్‌జాన్, డిప్యూటీ డీఈవో, మార్కాపురం

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోవాలి


కురిచేడు: మాట్లాడుతున్న ఏఓ మధుబాబు


పెద్దారవీడు: మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

కురిచేడు: మండలంలోని రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు కోరారు. మండలంలోని కల్లూరు, ఆవులమంద, పడమర నాయుడుపాలెం, పడమర వీరాయపాలెం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికి 981.92 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ వరిధాన్యం క్వింటా రూ.2,320లు, మామూలు రకం క్వింటా రూ.2300 మద్దతు ధర ఇస్తున్నట్లు తెలిపారు. తేమ 17 శాతం ఉండాలన్నారు.

పెద్దారవీడు: సాగులో యాజమాన్య పద్ధతులను రైతులు తప్పక పాటించాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి సూచించారు. మండలంలోని తోకపల్లి, అంబాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్లో సాగు చేసిన జొన్న, మినుము, బొబ్బర్లు, శనగ వంటి పంటలు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంటల్లో వచ్చే పురుగులు, తెగుళ్ల గురించి వివరిస్తూ నివారణ చర్యలు ఏ విధంగా చేపట్టాలో వివరంగా తెలియజేశారు. యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ వేయాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు ప్రేమ్‌కుమార్, వస్తంనాయక్, రైతులు పాల్గొన్నారు.

కత్తెర పురుగుపై జాగ్రత్తలు అవసరం

పుల్లలచెరువు: మొక్కజొన్న పంటలో ముఖ్యంగా కత్తెర పురుగు నివారణపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే అధిక దిగుబడులు సాధించేందుకు వీలుంటుందని వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. మండలంలోని గంగవరం, ముటుకుల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వేసిన మొక్కజొన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సూచనలు చేశారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగును గుర్తించినట్లు తెలిపారు. దీని నివారణకు విత్తనాలు వేసుకునేటప్పుడే కోరాజిన్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. పంట వేసినప్పుడు దాని చుట్టూ కంది లేదా పొద్దుతిరుగుడు వేసుకోవాలని సూచించారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకుని మొక్కజొన్న సాగు చేస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వీఏఏలు కృష్ణానాయక్, కొండానాయక్, శివానాయక్, రైతులు పాల్గొన్నారు.

తాళ్లూరు: పశుసంవర్ధక శాఖ ద్వారా అమలయ్యే ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని మన్నేపల్లి, తురకపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు ఎకరాలు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాల రైతులకు, ఐదు ఎకరాలు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి హామీ నిధుల ద్వారా కూలి వేతన ఖర్చులకు, మెటీరియల్ ఖర్చులకు 10 సెంట్లకు 6,599 రూపాయలు, 20 సెంట్లకు 13,197 రూపాయలు చెల్లిస్తారని తెలిపారు. వీటి కోసం అప్లికేషన్ ఫామ్, జాబ్‌కార్డ్, పొలం ఒన్-బీ, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్, రేషన్ కార్డ్ జిరాక్స్‌లు గ్రామ పశుసంవర్ధక అసిస్టెంట్ లేదా పశువైద్య అధికారికి అందించాలని కోరారు. సీహెచ్ బ్రహ్మయ్య, వీఏఏ సుధీర్, రైతులు పాల్గొన్నారు.


పుల్లలచెరువు: రైతులకు సూచనలిస్తున్న ఏవో నిర్మలాదేవి


తాళ్లూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రసాద్‌రావు

సంక్రాంతి సంబరాలు ఎలా చేయాలి?

రాచర్ల: గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు అధికారులు బిల్లులు చేయకుంటే గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఎలా చేయాలంటూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవెన్యూపై సమీక్ష జరుగుతున్న సమయంలో జేపీ చెరువు, అకవీడు ఎంపీటీసీలు జెట్టి వెంకటేశ్వర్లు, నందం రవి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు జరిగే సమయంలో ఎంపీటీసీలకు ఎలాంటి సమాచారం లేకుండా గుట్టుచప్పుడుగా గ్రామ సభలు నిర్వహించుకుని వెళ్లిపోయారని ఆరోపించారు. అంతేగాక జేపీ చెరువు వీఆర్వో గ్రామ సచివాలయంలో కేవలం ఒక గంట పాటు ఉండి వెంటనే మండల కేంద్రానికి వెళ్లిపోతున్నాడని, దీంతో రైతులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని, సంక్రాంతి పండగ వస్తున్న సమయంలో గ్రామాల్లో వీధి దీపాలు వేయలేని పరిస్థితి నెలకొందని చినగానిపల్లె, అనుములపల్లె, చోళ్లవీడు సర్పంచ్‌లు పగడాల రమేష్, సరిగిరి రమేష్, గోతం నారాయణ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీల్లో చిల్లిగవ్వ ఇవ్వకుండా ప్రభుత్వ ప్రవేశ పెడుతున్న సంక్రాంతి సంబరాలను గ్రామాల్లో ఎలా చేయాలని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు వస్తున్నా ఆయా శాఖల మండల అధికారులు సమావేశాలకు డుమ్మాకొడుతున్నారని, తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిట్టెం ఎలీశమ్మ, మండల కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ ఖాదర్‌బాషా, డిప్యూటీ తహసీల్దార్ భారతీబాయ్, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, విద్యుత్‌శాఖ ఏఈ బాలగురవయ్య, ఎంఈవో వారణాసి గిరిధర్ శర్మ, అకవీడు డాక్టర్ ఖాదర్‌బాషా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

పార్శిల్ కార్యాలయాల తనిఖీ

కంభం: కార్గో పార్సిల్ సర్వీస్, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుల్లో బుధవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కాలంలో నిషేధిత వస్తువులు రవాణాకు పలువురు కార్గో సర్వీస్‌లను వినియోగించుకుంటున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎటువంటి నిషేధిత వస్తువులు లభించలేదని తెలిపారు. అనుమానాస్పదంగా ఏవైనా వస్తువులు బుకింగ్ కోసం వస్తే వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు.

రుణాల కోసం దరఖాస్తుల స్వీకరణ

కురిచేడు: బీసీ కార్పొరేషన్ ఇచ్చే రుణాల కోసం మండలంలోని బీసీ, ఈబీసీలు 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బి.సతీష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయంలో ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గొర్రెల పెంపకం, మినీ డెయిరీ, ఆటో తదితర యూనిట్ల ఏర్పాటు కోసం రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. మండలానికి బ్యాంకు లింక్ స్కీమ్ 9 యూనిట్లు, జనరిక్ మెడికల్ షాపు-1 మొత్తం 10 యూనిట్లు కేటాయించినట్లు ఆయన వివరించారు.

అడవుల సంరక్షణపై అవగాహన

అర్ధవీడు: మండలంలోని పాపినేనిపల్లిలో బుధవారం అడవుల పరిరక్షణ మానవాళికి మనుగడ అనే అంశంపై ఎఫ్‌బీఓ మురళీకృష్ణ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. అడవులను సంరక్షించుకుంటే స్వచ్ఛమైన గాలితో పాటు వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండుతాయన్నారు. ఫారెస్టు అధికారులు రంగయ్య, పుల్లారావు, రంగారెడ్డి, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

రాచర్ల: బీసీ కార్పొరేషన్ 2024-25 సబ్సిడీ రుణాలు పొందేందుకు గ్రామ సచివాలయాల్లో ఈ 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. సబ్సిడీ రుణాల కోసం బీసీ-ఏ, బీసీ-బి, బీసీ-డీ, బీసీ-ఈ, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ, రెడ్డి, వైశ్యులు సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని కోరారు.

కొమరోలు: మండలంలో బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 33 యూనిట్ల సబ్సిడీ రుణాలు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ మస్తాన్‌వలి తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి బ్యాంక్ లింకేజ్ సబ్సిడీ రుణాల కోసం 33 యూనిట్లకు 64 లక్షల రూపాయలు, ఇడబ్ల్యూఎస్ యాక్షన్ ప్లాన్ కింద ఓబీఎంఎంఎస్ 7 యూనిట్లకు 12 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీలోపు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వెంకట సుబ్బారెడ్డికి వెంకాయమ్మ నివాళి


మృతదేహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: నగర పంచాయతీ పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఆవుల శివారెడ్డి తండ్రి వెంకట సుబ్బారెడ్డి (80) అనారోగ్య కారణంతో బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ బుధవారం సందర్శించి నివాళులర్పించారు. సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యార్థులకు పలకల పంపిణీ


విద్యార్థికి పలక అందజేస్తున్న హెచ్ఎం షేక్ అహ్మద్

పెద్దారవీడు: మండలంలోని ఏనుగులదిన్నెపాడులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు పలకలు, బలపాలు జెడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం షేక్ అహ్మద్ బుధవారం పంపిణీ చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ బంగారు బాల్యమే రేపటి భవిష్యత్తుగా వర్ధిల్లుతోందని, పిల్లలు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అజల్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా 40 మంది చిన్నారులకు పలకలు, బలపాలు, గ్రామానికి చెందిన రాచకొండ ఆంజనేయులు మధ్యాహ్న భోజనంలో అరటి పండ్లు అందజేశారు. ఎంపీపీ పాఠశాల హెచ్ఎం సుధీర్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు బలుసుపాటి నాగరాజు, సంస్థ ప్రెసిడెంట్ కొటారు ప్రభుదాస్, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి రూ.3.17 లక్షల జరిమానా


దాడుల వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

కురిచేడు: మండలంలో విద్యుత్ చౌర్యం, అనధికారికంగా అధిక లోడు వాడుకుంటున్న 72 మందికి జరిమానా విధించినట్లు విద్యుత్ విజిలెన్స్ ఈఈ టి.హైమావతి, దర్శి ఈఈ పి.శ్రీనివాసులు సంయుక్తంగా తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ తనిఖీల్లో 28 మంది విద్యుత్ చౌర్యానికి పాల్పడగా, 44 మంది అనధికార అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 28 మందికి రూ.1.49 లక్షలు, అదనపు లోడు వినియోగిస్తున్న 44 మందికి రూ.1.68 లక్షల జరిమానా విధించినట్లు వారు వెల్లడించారు. దాడుల్లో దర్శి డీఈఈ డీవీ కృష్ణారెడ్డి, పొదిలి డీఈఈ డి.హరిబాబు, చీమకుర్తి డీఈఈ ఆర్.మోహనరావు, ఒంగోలు డీఈఈలు ఏ.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, కురిచేడు ఏఈ బి. రామకృష్ణ, దర్శి డివిజన్ పరిధిలోని 11 మండలాల ఏఈలు, జేఈలు, 90 మంది సిబ్బంది పాల్గొన్నారు.

కందుల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి


మాట్లాడుతున్న ఏఓ లక్ష్మీనారాయణ

దొనకొండ: రైతులు కందులు అమ్ముకునేందుకు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వద్దిపాడులో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాటాల్డుతూ కంది పంట సాగు చేసి ఈ-పంట నమోదు చేసిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కందులు అమ్ముకునేందుకు ఆధార్ కార్డుతో గ్రామ వ్యవసాయ సహాయకులను కలవాలన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో 5,515 ఎకరాల్లో కంది పంటను సాగు చేశారన్నారు. అనంతరం సంగాపురం, వెస్ట్ కంభంపాడు, ఆరవల్లిపాడు గ్రామాల్లో కంది, పొగాకు పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, వీఆర్ఓ హుసేన్, వ్యవసాయ విస్తరణాధికారి యోగేశ్వరరావు, సహాయకులు రమేష్, ధనరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నవోదయ ఎంట్రన్స్ పరీక్ష


బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ 1, 2 శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నవోదయ ఎంట్రన్స్ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న 5వ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష ఎంఈఓలు 1,2 శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యంల పర్యవేక్షణలో బుధవారం నిర్వహించారు. మండల స్థాయి మోడల్ ఎంట్రన్స్‌కు మొత్తం 10 ప్రభుత్వ పాఠశాలల నుంచి 86 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులు నవోదయ పరీక్షల్లో మంచి మార్కులు రాసి సీటు సాధించాలని, ఎంట్రన్స్ పరీక్షలో మెళకువలు తెలియజేశారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల్లోనే ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ ఉపాధ్యాయులు ఇవ్వడమనేది అభినందనీయమన్నారు. మోడల్ పరీక్షకు చీఫ్‌గా దేవరాజుగట్టు కాంప్లెక్స్ హెచ్ఎం షేక్ రసూల్ వ్యవహరించారు. పరీక్షలో మొదటి స్థానం ఓబులక్కపల్లి పాఠశాల విద్యార్థి షేక్ సాహిల్, రెండో స్థానం సుంకేసుల పాఠశాల విద్యార్థి బి. రాజ్‌తరుణ్, మూడో స్థానం దేవరాజుగట్టు పాఠశాల విద్యార్థి కె.గౌతమి ప్రతిభ చాటారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎంలు జీవీ కృష్ణారెడ్డి, పి.ప్రభాకర్, కె. వెంకటేశ్వరరెడ్డి, పి.శ్రీరామ్‌శెట్టి, శ్రీనివాస్, బాషా, నగేష్, రామ్‌శేఖర్, అల్లూరి శ్రీనివాసులు, చరణ్, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com